# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 24-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్, అమెరికా దేశాల మధ్య లోతైన, విస్తృతమైన సహకారం ఉందని విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.
- ❖ వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) కొత్త చట్టం జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.
- ❖ దేశంలో ఎబోలా వ్యాధికి సంబంధించిన ఒక్క కేసు కూడా నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.
- ❖ వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ జట్టుపై విజయం సాధించడంతో రాజస్థాన్ రాయల్స్ ప్లే ఆఫ్స్‌కు చేరుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, అమెరికా దేశాల మధ్య లోతైన, విస్తృతమైన సహకారం ఉందని విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయని త్వరలో ఆ దేశ బృందం భారత్‌కు రానుందని చెప్పారు. వాణిజ్యం, ఇంధనం, రవాణా, ప్రాంతీయ భద్రత వంటి కీలక సహకార రంగాలపైన విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్.. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో విస్తృత చర్చలను న్యూఢిల్లీలో ఈరోజు జరిపారు. ఇరు దేశాల సంబంధాలు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయని పాత్రికేయులతో జైశంకర్ పేర్కొంటూ…

(వాయిస్ 21 సెకన్లు)

అనంతరం అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో మాట్లాడుతూ… ప్రపంచంలో అమెరికాకు అత్యంత ముఖ్యమైన భాగస్వాములలో భారత్ ఒకటని అభివర్ణించారు. భారత్, అమెరికా రెండూ ఉగ్రవాద బాధిత దేశాలేనని పేర్కొంటూ… ఉగ్రవాదంపై పోరులో భారత్‌తో కలిసి నడుస్తామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) (వీబీజీ-రామ్- జీ) కొత్త చట్టం జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వీబీ జీ-రామ్-జీ ముసాయిదాను ప్రభుత్వం ఈరోజు విడుదల చేసింది. ముసాయిదా నిబంధనలపై ప్రజలు, నిపుణుల నుంచి అభిప్రాయాలను జూన్ 21వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు వెల్లడించింది. కొత్త విధానం ప్రకారం గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్ర నిధుల కేటాయింపులో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. ముఖ్యంగా పెద్ద రాష్ట్రాలు, ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ముసాయిదాలో పేర్కొంది. 16వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం జనాభా, తలసరి ఆదాయాన్ని ఆధారంగా తీసుకుని నిధులను పంపిణీ చేయనుంది. ఇందులో తలసరి ఆదాయం తక్కువగా ఉన్న రాష్ట్రాలకు 42.5 శాతం అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం ప్రతిపాదించింది. అలాగే ఇప్పటివరకు ఉపాధి హామీ పథకంలో వేతన భారం మొత్తం కేంద్ర ప్రభుత్వం భరించగా... కొత్త చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సి ఉంటుంది. రెండో ఏడాది నుంచి రాష్ట్రాల పనితీరు ఆధారంగానే అదనపు నిధుల కేటాయింపు ఉండనుంది. ఈ మార్పులతో గ్రామీణ ఉపాధి పథకాల అమల్లో పారదర్శకత, బాధ్యత పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2026 సంవత్సరానికి గాను పద్మ పురస్కారాలను రేపు ప్రధానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆకాశవాణిలో ప్రజల పద్మ సిరీస్‌లో భాగంగా 16 కార్యక్రమాలను ప్రసారం చేస్తారు. ఈ ఎపిసోడ్‌లలో పద్మ పురస్కార గ్రహీతల వృత్తి జీవితం గురించి శ్రోతలకు తెలియచేస్తారు. ఈ ఎపిసోడ్‌లు ఈరోజు, రేపు 100.1 ఆకాశవాణి గోల్డ్‌లో ప్రసారం అవుతాయని నిర్వాహకులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో ఎబోలా వ్యాధికి సంబంధించిన ఒక్క కేసు కూడా నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఎబోలా వ్యాప్తికి సంబంధించిన మారుతున్న పరిస్థితుల దృష్ట్యా తదుపరి ఆదేశాలు వెలువడే వరకు డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ ది కాంగో, ఉగాండా దక్షిణ సూడాన్‌లకు అత్యవసరం కాని ప్రయాణాలను నివారించాలని  దేశ ప్రజలకు సూచించింది. ప్రస్తుతం ఈ దేశాలలో నివసిస్తున్న లేదా అక్కడికి ప్రయాణిస్తున్న భారతీయ ప్రజలు స్థానిక అధికారులు జారీ చేసిన ప్రజారోగ్య మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించింది.  ఆఫ్రికాలోని డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండాలలో `బుండిబుగ్యో` రకం ఎబోలా వైరస్ వ్యాప్తి చెందుతున్నట్లు నిర్ధారణ అయింది. దీని తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఈ పరిస్థితిని `అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి`గా  ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 134వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆరోగ్యకరమైన సమాజంతో మాత్రమే సంపన్నమైన దేశ నిర్మాణం సాధ్యపడుతుందని కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయా అన్నారు. కామన్వెల్త్ దినోత్సవం సందర్భంగా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన సైకిల్ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొని యువతను ఉద్దేశించి కేంద్రమంత్రి ఈరోజు ప్రసంగించారు. కాలుష్యానికి

సైక్లింగ్ సరైన పరిష్కారమని చెప్పారు. సైక్లింగ్ ద్వారా ఇంధనాన్ని కూడా ఆదా చేయవచ్చునని మన్సుఖ్ మాండవీయా పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆఫ్రికన్ యూనియన్‌లో విస్తరిస్తున్న ఎబోలా వ్యాధిని ఎదుర్కొనేందుకు మొదటి విడతగా అక్కడి ప్రజలకు అవసరమైన అత్యవసర వైద్య సామాగ్రిని భారతదేశం ఈరోజు పంపింది. ఆ వివరాలను సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తెలిపారు. ఆఫ్రికన్ యూనియన్ లో విస్తరిస్తున్న ఎబోలా వ్యాధిని నియంత్రించే క్రమంలో ఆఫ్రికన్ యూనియన్ కి సహాయంగా ఈ వైద్య సామాగ్రిని పంపినట్లు చెప్పారు. ఆఫ్రికన్ యూనియన్‌తో సమన్వయం చేసుకుంటూ ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి భారతదేశం కట్టుబడి ఉందని జైశంకర్ స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ జట్టుపై 30 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్ విజయం సాధించింది. ఈ గెలుపుతో ఆ జట్టు ప్లే ఆఫ్స్‌కు చేరుకుంది. మరోవైపు కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన కోల్ కతా తొలుత ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్ ప్రారంభించిన ఢిల్లీ క్యాపిటల్స్ 11 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని తూర్పు ఉత్తర ప్రదేశ్, తూర్పు మధ్య ప్రదేశ్, విదర్భ ప్రాంతాలలో తీవ్రమైన వడగాలుల ప్రభావం నేపథ్యంలో ఆయా ప్రాంతాలకు ఎరుపు రంగు ప్రమాద హెచ్చరికలను భారత వాతావరణ విభాగం (ఐఎండి) ఈరోజు జారీ చేసింది. అదే విధంగా రాబోయే 5 రోజులలో ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, విదర్భ, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీలోని కొన్ని ప్రాంతాలలో వడగాలుల పరిస్థితులు ఉంటాయని కూడా ఐఎండి అంచనా వేసింది. రాబోయే మూడు రోజులలో ఈ ప్రాంతాలలో సైతం తీవ్రమైన వడగాలుల పరిస్థితులు ఏర్పడవచ్చునని పేర్కొంది. ఆ వివరాలను ఐఎండి శాస్త్రవేత్త శ్రీవాత్సవ తెలియచేస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లోని ఫాల్తా అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన రీ-పోలింగ్ లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి దేబాంశు పాండా ఘన విజయం సాధించారు. ఆయనకు లక్షా 9 వేలకు పైగా ఓట్ల మెజారిటీ లభించింది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) అభ్యర్థి శంభునాథ్ కుర్మి 40 వేల 600కు పైగా ఓట్లతో రెండవ స్థానంలో నిలిచారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =